సాక్షి అనంతపురం

శనివారం । 11 । జనవరి । 2025

I



చీనీ టన్ను రూ.24,320

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,320 పలికాయి.



టమాట కిలో రూ.11

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.11, కనిష్టం రూ.7, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.8°/14.4°

జిల్లా అంతటా శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అదిగో చిరుత



ముదిగల్లు సమీపంలో గుట్టపై చిరుత ఉన్న దృశ్యం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మునిసిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామ సమీపంలో గుట్టపై శుక్రవారం చిరుత కన్పించింది. ఉదయం గ్రామస్తులు చిరుత గుట్టపై ఉండటాన్ని చూసి శబ్దాలు చేస్తూ కేకలు వేశారు. దీంతో అది గుట్టపై నుంచి కిందిభాగంలో ఉన్న గుహలోకి వెళ్లిపోయింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ షాన్‌వాజ్, బీట్ ఆఫీసర్ నాగే నాయక్ వైల్డ్ ప్రొటెక్షన్ వాచర్లతో కలిసి చిరుత సంచరించిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి నుంచి చిరుతను తరిమేందుకు చర్యలు చేపట్టారు. మళ్లీ కన్పిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కాగా..చిరుత సంచారంపై స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో జనావాసాల్లోకి వస్తే తమ పరిస్థితి ఏంటని అంటున్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో పలువురికి చోటు



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కమిటీలో పలువురికి చోటు కల్పించింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా గంగాధర్ (కళ్యాణదుర్గం), కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి(అనంతపురం అర్బన్), సీబీ నైరుతి(గుంతకల్లు), ఎస్.మారెన్న(రాయదుర్గం), శివ లింగప్ప(ఉరవకొండ), ఫక్కూబాయి నూర్ మహమ్మద్(శింగనమల), టీ లక్ష్మీదేవి(తాడిపత్రి), ప్రధాన కార్యదర్శులుగా ఎన్.గాది లింగేశ్వర బాబు(గుంతకల్లు), ఆలమూరు శ్రీనివాస రెడ్డి(అనంతపురం అర్బన్), బోయ తిమ్మరాయుడు(కళ్యాణదుర్గం), ఎం.అశోక్(ఉరవకొండ), గౌని నాగన్న(అనంతపురం అర్బన్), కోశాధికారిగా పాటిల్ నాగిరెడ్డి(రాయదుర్గం), కార్యనిర్వహణ కార్యదర్శులుగా లింగాల రమేష్, చింతకుంట అమర్‌నాథ్, మల్లెల వేణుగోపాల్(అనంతపురం అర్బన్), షేక్ ఖాజాపీర్, కొసినేపల్లి నరసింహారెడ్డి(తాడిపత్రి), పాటిల్ చెన్నకేశవ రెడ్డి, పీ సందీప్‌కుమార్(రాయదుర్గం), కరణం రాహుల్, తలారి సత్యప్ప(కళ్యాణదుర్గం), కే భరత్ రెడ్డి, మూల నారాయణ రెడ్డి(ఉరవకొండ), పెమ్మక చెన్న కేశవరెడ్డి, ఎస్‌వీఆర్ మోహన్ (గుంతకల్లు), భూమిరెడ్డి సునీతమ్మ(శింగనమల), సెక్రటరీ యాక్టివిటీలు (కార్యాచరణ కార్యదర్శులు)గా గురుశేఖర్‌బాబు, వంకదారి వెంకటకృష్ణ(అనంతపురం అర్బన్), కేపీ బసప్ప, కాంతం దేవరాజు(రాయదుర్గం), యరమ్మపల్లి కృష్ణమూర్తి, పీ ఆనంద్ చౌదరి(కళ్యాణదుర్గం), మల్లెల జగదీష్, సుద్దాల వెంకటేష్(ఉరవకొండ), పేరం ప్రతాప్ రెడ్డి, షేక్ బాబా ఫకృద్దీన్(తాడిపత్రి), బిందె గురు ప్రసాద్, ఎం.నాగేంద్ర(గుంతకల్లు), గువ్వల శ్రీకాంత్ రెడ్డి, సపట్ల లక్ష్మీనారాయణ(శింగనమల), అధికార ప్రతినిధులుగా చింతకుంట మధు(అనంతపురం అర్బన్), యరమండల్ గురుశేఖర్(తాడిపత్రి), సీపీ వీరన్న(ఉరవకొండ), గోపవరం శ్రీనివాసులు(కళ్యాణదుర్గం), కే మాధవ్ రెడ్డి(రాయదుర్గం), నెరివేని ప్రవీణ్‌కుమార్(గుంతకల్లు), ఎన్.వీర నారాయణ(శింగనమల) నియమితులయ్యారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో నిర్వహించిన ఎంటెక్ మూడో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీఫార్మసీ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్, రెండో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగ ప్రసాద్ నాయుడు శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్లు అంకారావు, జి.రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

ముక్కోటి వైభవం



అనంతపురం పాతూరులోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామివారు





ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉత్తరద్వారం గుండా స్వామివారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుదీరారు. అనంతపురం పాతూరులోని చెన్నకేశవాలయం, ఆర్‌ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, రాంనగర్‌లోని వేంకటేశ్వరస్వామి, పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి, తాడిపత్రిలోని చింతల వెంకటరమణస్వామి, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి, యాడికి లక్ష్మీ చెన్నకేశవస్వామి, రాయదుర్గంలోని ప్రసన్న వేంకటరమణస్వామి తదితర ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అలాగే శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఖాద్రీశుని దర్శనానికి 80 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



ఖాద్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఉత్తర ద్వారంలో బారులు తీరిన భక్తులు



నమోనమః



తాడిపత్రి చింతల వెంకటరమణస్వామి ఆలయంలో భక్తుల క్యూ



అనంతపురం ఆర్ఎఫ్‌రోడ్డులో శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు



పెన్నహోబిలంలో స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి క్యూకట్టిన భక్తులు

ఓపెన్‌గా అమ్మేద్దాం!

- రూ.15 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంపై రియల్టర్ల కన్ను
- చంద్రప్రియనగర్‌లో 2.20 ఎకరాల్లో లేఔట్
- సెంటు రూ.7–8 లక్షల దాకా విక్రయానికి సిద్ధం
- చోద్యం చూస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు



రియల్టర్లు విక్రయానికి సిద్ధం చేసిన ఓపెన్ సైటు ఇదే

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని భూములకు విపరీతమైన ధరలు రావడంతో రియల్టర్ల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. ఏళ్ల క్రితం వేసిన లేఔట్లలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలనూ వదలడం లేదు. అడ్డగోలుగా అమ్మేస్తూ రాత్రికిరాత్రే కోటీశ్వరులు కావాలని చూస్తున్నారు. అక్రమార్కులకు పంచాయతీ, రెవెన్యూ అధికారుల అలసత్వం కలిసివస్తోంది. అనంతపురం రూరల్ మండలం కురుగుంట రెవెన్యూ గ్రామ పరిధిలోని 108, 109–1, 109–2ఏ, 109–2బీ సర్వేనంబర్లలో 26 ఏళ్ల క్రితం 'చంద్రప్రియ నగర్' పేరిట 22 ఎకరాల్లో లేఔట్ వేశారు. అప్పట్లో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజా ప్రయోజనాల కోసం 2.20 ఎకరాల స్థలాన్ని పంచాయతీకి కేటాయించారు. అప్పటి నుంచి ఇది ఓపెన్ స్థలంగానే ఉంది. ఇందులోనే గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయోత్పత్తుల నిల్వ కోసం గోదాము నిర్మించారు. గోదాము పోను తక్కిన స్థలాన్ని కాజేసేందుకు ఏడాది కిందట కొందరు రియల్టర్లు ప్రయత్నించారు. ఇక్కడ సెంటు స్థలం రూ.7–8 లక్షల దాకా పలుకుతోంది. ఈ లెక్కన స్థలం విలువ రూ.15 కోట్లకు పైగా ఉంది. ఈ క్రమంలో చదును చేసి ప్లాట్లు వేయాలని చూడగా..అప్పట్లో అధికారులు వెంటనే స్పందించి అడ్డుకున్నారు. హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. 'ఇది పంచాయతీకి చెందిన భూమి. ఎలాంటి క్రయవిక్రయాలూ జరపకూడదు. అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం' అని పేర్కొంటూ బోర్డు నాటించారు.

ఎన్నికల సమయంలో బోర్డు మాయం

సార్వత్రిక ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో అధికారులంతా అందులో నిమగ్నమయ్యారు. సందట్లో సడేమియా లాగా అక్రమార్కులు రంగ ప్రవేశం చేసి పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించారు. ఆ సంగతి కూడా ఇప్పటిదాకా అధికారులకు తెలీదంటే..ప్రభుత్వ భూములు, స్థలాలపై పర్యవేక్షణ ఎంతమాత్రం ఉందో అర్థం చేసుకోవచ్చు.

చదును చేసి...లేఔట్ వేసి

ఇటీవల అక్రమార్కులు మళ్లీ రంగంలోకి దిగారు. భూమిని చదును చేసి 41 ప్లాట్లతో లేఔట్ వేశారు. సెంటు స్థలం రూ.7–8 లక్షల దాకా అమ్మకానికి సిద్ధమయ్యారు. స్థానికులకు ఈ లేఔట్‌పై అవగాహన ఉంది. దీంతో ఎవరూ కొనుగోలుకు ముందుకు రావడం లేదు. అయితే ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడిన వారికి మాయమాటలు చెప్పి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రోజూ కొందరు వచ్చి ఈ లేఔట్‌ను పరిశీలించి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే అత్యంత విలువైన స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదముంది.

క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం

చంద్రప్రియనగర్‌లో ప్రజాప్రయోజనాల కోసం వదిలిన 2.20 ఎకరాల స్థలం పంచాయతీదే. గతంలో ఎవరో చదును చేసే ప్రయత్నం చేస్తే అడ్డుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశాం. ఇటీవల ఆ బోర్డును తొలగించి.. మళ్లీ చదును చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసి.. క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఇలాంటి చోట్ల ఎవరైనా ప్లాట్లు కొనుగోలు చేసినా నష్టపోతారు. కొనుగోలుదారులకు ఏవైనా సందేహాలుంటే పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలి.

– హిదయతుల్లా, పంచాయతీ కార్యదర్శి, కురుగుంట

ప్రశాంతంగా పదోన్నతుల కౌన్సెలింగ్



డీఈఓను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం నగరపాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మునిసిపల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న పీఎస్‌హెచ్‌ఎం, తెలుగు, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు శుక్రవారం కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్ బాబు అధ్యక్షతన కౌన్సెలింగ్ చేపట్టారు. ఉదయం సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. అనంతరం కౌన్సెలింగ్ జరిగింది. అనంతపురం నగరంతో పాటు, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, ధర్మవరం, కదిరి, హిందూపురంలోని వివిధ స్కూళ్లలో పోస్టులను భర్తీ చేశారు. నగరపాలక, మునిసిపాలిటీ టీచర్ల పదోన్నతులను చేపట్టడం పట్ల రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ డీఈఓ ప్రసాద్‌బాబును సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎస్.రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, నాయకులు బి.ఫణిభూషణ్, పి.అజయ్‌కుమార్, కె.అనురాధ, వి.రాజశేఖర్, జి.మల్లికార్జున, ఎ.నాగభూషణ, గంగాధర్, రామాంజనేయులు నాయక్, లక్ష్మీదేవి, శంకర్ పాల్గొన్నారు.

క్షమాపణ చెబితే ప్రాణాలు తిరిగొస్తాయా?

- తిరుపతి ఘటనకు చంద్రబాబు ప్రభుత్వానిదే బాధ్యత
- రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: తిరుపతి ఘటనలో ఆరుగురు భక్తులు మరణించడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం దాగి ఉందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షమాపణలు చెబితే పోయిన ప్రాణాలు తిరిగొస్తాయా అని రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ఘటనకు సీఎం చంద్రబాబు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఆయన శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లక్షలాది మంది భక్తులు వేంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తారని తెలిసి కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. తిరుమల ప్రతిష్టకు భంగం కల్గించిన దేవదాయ శాఖ మంత్రితో రాజీనామా చేయించాలని, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో నిమగ్నమై, తిరుపతిలోని అత్యవసర కార్యక్రమంలో బందోబస్తును ప్రభుత్వం విస్మరించిందన్నారు. తెలంగాణలో పుష్ప–2 ప్రదర్శన సందర్భంగా థియేటర్ వద్ద తొక్కిసలాటలో ఒకరు మరణించగా..అల్లు అర్జున్‌పై చర్యలు తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మెచ్చుకున్నారని, మరి ఇక్కడ ఆరుగురు భక్తులు చనిపోతే ఏం చర్యలు తీసుకున్నారో సీఎం, డిప్యూటీ సీఎం చెప్పాలని నిలదీశారు. టీటీడీ చైర్మన్, ఈఓ, అధికారులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం చూస్తుంటే ప్రభుత్వానికి నియంత్రణ ఉందో లేదోనన్న అనుమానం కలుగుతోందన్నారు. హిందుత్వాన్ని అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడల్లా హిందువులు మరణిస్తున్నారని, గోదావరి పుష్కరాలు, తిరుపతి ఘటనలే ఇందుకు నిదర్శనమని అన్నారు. శ్రీవారి లడ్డూపై దుష్ప్రచారం చేసి 108 రోజులైందని, అందుకే స్వామివారు పవన్ కల్యాణ్‌తో క్షమాపణలు చెప్పించారని అన్నారు. తిరుపతి చరిత్రలో ఎన్నడూ ఇటువంటి ఘోరం జరగలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చంద్ర, ఈశ్వరయ్య, నీరుగంటి నారాయణరెడ్డి, వలి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మీ పనితీరు బాగోలేదు

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



గొందిరెడ్డిపల్లి వద్ద ఎంఎస్ఎంఈ పార్క్ స్కెచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం అర్బన్/టౌన్/రాప్తాడు: 'జిల్లాలో 0–6 ఏళ్ల వయసున్న చిన్నారుల ఆధార్ నమోదు విషయంలో మీ పనితీరు సంతృప్తికరంగా లేదు. ఇంత నిర్లక్ష్యంగా పనిచేస్తే ఎలా? ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేయాల'ని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. డీఆర్‌ఓ మలోల, ఇతర అధికారులు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 0–6 ఏళ్ల వయసున్న చిన్నారులు జిల్లాలో 75,287 మంది ఉండగా.. ఇప్పటి వరకు 5,798 మంది చిన్నారుల ఆధార్ జనరేషన్ పూర్తయ్యిందన్నారు. మిగిలిన చిన్నారుల ఆధార్ జనరేషన్ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండినా ఆధార్ కార్డు లేని వారికి కూడా ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాల్లో అప్రూవల్ చేయించి కార్డు వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, ఐసీడీఎస్ పీడీ వనజఅక్కమ్మ, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఆధార్ జిల్లా నోడల్ అధికారి నారప రెడ్డి, సీఎస్‌సీ జిల్లా మేనేజర్ సాగర్, లీడ్ బ్యాంక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరో వంద ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్

జిల్లాలో మరో వంద ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు నీటి వసతి ఉండే భూములను సేకరించాలని ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రస్తుతం రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలోని ఎంఎస్ఎంఈ పార్క్ తరహాలో మరో పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆయన శుక్రవారం స్థానిక బళ్లారి రోడ్డులోని ఏపీఐఐసీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గొందిరెడ్డిపల్లి వద్ద ఉన్న ఎంఎస్ఎంఈ పార్కును పరిశీలించారు.

రైతులకు న్యాయమైన పరిహారం

ప్రాజెక్టులకు భూములు సేకరించే క్రమంలో రైతులకు న్యాయమైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి డీఎల్‌సీ సమావేశం నిర్వహించారు. కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణానికి బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామంలో 17.97 ఎకరాల భూమిని సేకరించామన్నారు. రైతులకు ప్రతిపాదిత మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం చెల్లిస్తామన్నారు. తాడిపత్రి మండల పరిధిలో ఏపీ ట్రాన్స్‌కోకు సంబంధించి 21 టవర్లు, 132/220/400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లను మార్చేందుకు భూమి సేకరిస్తున్నామన్నారు. మార్కెట్ విలువకు అనుగుణంగా మూడు విధాలుగా పరిహారం ఇస్తామన్నారు. కళ్యాణదుర్గం ఆర్‌డీఓ వసంతబాబు, కలెక్టరేట్ భూ పరిపాలన విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, ఎన్‌హెచ్ఏఐ పీడీ తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సమ్మేళనానికి 'హిల్‌వ్యూ' ముస్తాబు



క్రీడోత్సవాలకు సిద్ధమైన హిల్‌వ్యూ స్టేడియం

పుట్టపర్తి రూరల్: సత్యసాయి సాంస్కృతిక క్రీడా సమ్మేళనానికి హిల్‌వ్యూ స్టేడియం సిద్ధమైంది. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ ట్రస్టు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. బాబా భౌతికంగా ఉన్న రోజుల్లో 1995లో సత్యసాయి యూనిటీ కప్ పేరిట ఇండియా 11, వరల్డ్ 11 మధ్య ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్ ఈ మైదానంలోనే నిర్వహించడం గమనార్హం. శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని పుట్టపర్తి, బెంగళూరు బృందావనం, ముద్దెనహళ్లి, అనంతపురం క్యాంపస్ విద్యార్థులు, ఈశ్వరమ్మ, ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాల విద్యార్థులు, వైట్‌ఫీల్డ్ స్విమ్స్ నర్సింగ్ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొంటారు. శనివారం ఉదయం 8 గంటలకు బ్రాస్‌బాండ్‌తో కూడిన మార్చ్ ఫాస్ట్‌తో మొదలవుతుంది. 9 గంటలకు క్రీడా జ్యోతి వెలిగించి పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం 10.30 గంటల వరకూ సాంస్కృతిక క్రీడా విన్యాసాలు ఉంటాయి. సాయంత్రం 4.15 నుంచి 7 గంటల వరకూ ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా

అరటి చెట్ల నరికివేత


నరికేసిన అరటిచెట్లు

యల్లనూరు: మండలంలోని బొప్పేపల్లిలో రైతు సుదర్శననాయుడు సాగు చేసిన అరటి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. పుట్లూరు మండలం కొండుగారికుంటకు చెందిన సుదర్శన నాయుడు తనకున్న మూడు ఎకరాల్లో 3 వేల అరటి చెట్లను సాగు చేస్తున్నాడు. ఎనిమిది నెలల వయస్సున్న అరటి చెట్లు నాణ్యమైన గెలలతో ఉన్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలో అరటి గెలలను మార్కెట్‌కు తరలించేందుకు రైతు సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి చొరబడి 1,052 చెట్లను నరికి వేశారు. శుక్రవారం ఉదయం తోటకు వెళ్లిన సుదర్శననాయుడు... చెట్ల నరికివేతను గుర్తించి సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు అక్కడకు చేరుకుని పరిశీలించారు. స్నిఫ్ఫర్ డాగ్‌ను రంగంలో దించి దుండగుల ఆచూకీ కోసం గాలించారు. ఘటనతో రూ.5.50 లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్న్‌షిప్‌కు అవకాశం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, తదితరులు

అనంతపురం: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. అర్హులైన వారు దరఖాస్తులను https://pminternship.mca.gov.in/ login వెబ్‌సైట్ ద్వారా అందజేయవచ్చు. వివరాలకు కరీముల్లా (83413 66022), రఫీ (94906 22810)ను సంప్రదించవచ్చు.

అత్యుత్తమ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్

దేశంలోనే అత్యుత్తమంగా ఖ్యాతి గాంచిన 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పిస్తారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన వారికి స్టైఫండ్ కింద నెలకు రూ.5 వేలు చెల్లిస్తారు. ఇందులో రూ.4,500ను కేంద్ర ప్రభుత్వం, రూ.500ను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కంపెనీ భరిస్తాయి. అలాగే వన్–టైమ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద కేంద్ర ప్రభుత్వం నేరుగా రూ.6 వేలను ఒకేసారి చెల్లిస్తుంది. ప్రధాన మంత్రి బీమా యోజన, ప్రధాన మంత్రి ప్రమాద బీమా యోజన కింద పరిరక్షణ కల్పిస్తారు. 18 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, బీబీఏ, బీఫార్మసీ, పూర్తి చేసిన వారు, చివరి సెమిస్టర్‌లో చదువుతున్నవారు అర్హులు.


చామంతి పూల కోతలో నిమగ్నమైన కూలీలు

లాభాల పూదోట

నార్పల, బుక్కరాయసముద్రం మండలాల్లో పూల సాగు చేపట్టిన రైతుల ఇంట సిరుల వర్షం కురుస్తోంది. గడ్డం నాగేపల్లి, వెంకటాంపల్లి గ్రామ పొలాల్లో చామంతి పూల తోటలు, బుక్కరాయసముద్రం వద్ద బంతి పూల తోటలు కనువిందు చేస్తున్నాయి. వరుసగా పండుగలు, శుభకార్యాలు రానుండడంతో ఇటు రైతులకు అటు వ్యాపారులకూ లాభాల పంట పండనుంది. సాధారణ పంటల్లో నష్టాలు చవిచూసిన రైతులు తాజాగా పూల సాగుతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. పూల దిగుబడులను బెంగళూరు, హైదరాబాదు, రాజమండ్రి , విజయవాడ ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.120 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక పూల సాగు ద్వారా టోకు వ్యాపారులు, చిరువ్యాపారులు, కూలీలకు సమృద్ధిగా ఉపాధి లభిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


గడ్డం నాగేపల్లి వద్ద సాగులో ఉన్న చామంతి పూలు


బుక్కరాయసముద్రం వద్ద బంతిపూలను కోస్తున్న కూలీలు

టీడీపీ నేతల బరితెగింపు

- పాఠశాల ప్రహరీ కూల్చివేత
- స్థలం కబ్జా కోసమే దుశ్చర్య
- కూల్చివేత వెనుక అధికారుల హస్తం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి అంశాన్ని తమకు ఆదాయ వనరుగా స్థానిక టీడీపీ నేతలు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలం కనిపిస్తే వెంటనే కబ్జా చేసేస్తున్నారు. తాజాగా మరో అడుగు ముందుకేసి ఏకంగా పాఠశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు పావులు కదిపారు. పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చి వేశారు. కణేకల్లు మండలం తుంబిగనూరు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

దౌర్జన్యాలకు పరాకాష్టగా..

ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూల్చివేత ఘటన స్థానిక టీడీపీ నేతల దౌర్జన్యాలకు పరాకాష్టకు నిదర్శనంగా నిలిచింది. ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'మనబడి నాడు–నేడు' కింద వివిధ అభివృద్ధి పనులను చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. విద్యార్థుల తాగునీటి కోసం రూ.1.20 లక్షల వ్యయంతో వాటర్ సంప్ ఏర్పాటు చేశారు. పాఠశాల చుట్టూ ప్రహరీని నిర్మించారు. ఈ పాఠశాల వెనుక అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత ప్రభాకరగౌడ్, కోట్రేగౌడ్ పొలాలు ఉన్నాయి. వీటికి రాకపోకలు సాగించేందుకు గరుడచేడు గ్రామం వైపుగా రస్తా కూడా ఉంది. అయితే పాఠశాల పక్క నుంచి అయితే దగ్గరగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సదరు పొలానికి మార్కెట్‌లో డిమాండ్ భారీగా పెరిగే అవకాశాలూ ఉన్నాయి. దీంతో వ్యవసాయ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించాలని నిర్ణయించుకున్న టీడీపీ నేతలు తమ పలుకుబడిని ఉపయోగించారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు కావడంతో ఉపాధ్యాయులు ఎవరూ విధులు హాజరు కారని తెలుసుకున్న టీడీపీ నేతలు ఆగమేఘాలపై కూల్చివేత పనులు చేపట్టారు. ఈ దుశ్చర్యకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ పరోక్షంగా సహకరించినట్లు విమర్శలున్నాయి. మొత్తం 18 అడుగుల వెడల్పు... 50 అడుగుల పొడవు ఉన్న స్థలాన్ని అందరూ చూస్తుండగానే సోదరులిద్దరూ కబ్జా చేశారు.


కూల్చి వేతలు మొదలు పెట్టిన దృశ్యం

హెచ్చరించిన 'సాక్షి'

తుంబిగనూరు గ్రామంలో టీడీపీ నేతలు స్కూల్ స్థలం కబ్జాకు కుట్రలు సాగిస్తున్న వైనాన్ని గతంలో 'సాక్షి' బహిర్గతం చేసింది. గత ఏడాది డిసెంబర్ 5న 'స్కూల్ స్థలంపై పచ్చనేత కన్ను' శీర్షికతో 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. అయితే అప్రమత్తమవ్వాల్సిన అధికారులు టీడీపీ నేతలకు అండగా నిలిచి దురాక్రమణకు ప్రోత్సహించడం విమర్శలకు దారితీస్తోంది. ఈ కబ్జాలో అధికారుల వాటా ఎంత? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలి

- హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వ కుట్ర
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్


మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ డిమాండ్ చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో టోకెన్ కోసం వెళ్లి ఆరుగురు మృత్యువాత పడితే టీటీడీ చైర్మన్ నాయుడు ఇది దైవ నిర్ణయమంటూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కలియుగ ప్రత్యక్ష దైవంపై మోపడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే వేంకటేశ్వరస్వామిపై ఎఫ్ఐఆర్ కట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందన్నారు. ప్రభుత్వం, పాలకమండలి, టీటీడీ అధికారుల నిర్లక్ష్యంపై మాట్లాడకుండా దేవుడిపై నెపం వేయడం సబబు కాదన్నారు. అలాగే ఇందులో గత ప్రభుత్వ నిర్లక్ష్యం, కుట్ర దాగి ఉందంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చౌకబారు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. గోదావరి పుష్కరాల్లో 29 మందిని, కందుకూరులో 8 మందిని, గుంటూరులో 3, రాజమండ్రిలో 2, యువగళంలో తారకరత్నను, తాజాగా తిరుపతిలో ఆరుగురిని పొట్టన పెట్టుకున్న నీచ చరిత్ర చంద్రబాబుదేనన్న అంశాన్ని మరువ రాదని పవన్ కళ్యాణ్‌కు హితవు పలికారు. సమావేశంలో కుంటిమద్ది రమేష్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ బాధ్యతారాహిత్యమే

- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్


మాట్లాడుతున్న రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా తిరుపతి దుర్ఘటన నిలిచిందని వైఎస్సార్‌సీపీ అనంతపురం టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ ధ్వజమెత్తారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ చైర్మన్, ఈఓ మధ్య.... ఈఓ, డిప్యూటీ ఈఓ మధ్య నెలకొన్న విభేదాలు స్వయంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సమీక్షలో బహిర్గతం కావడం గమనార్హమన్నారు. దుర్ఘటనకు కారణమైన టీటీడీ చైర్మన్‌ను తొలగించి, టీటీడీ ఈఓ, డిప్యూటీ ఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పు జరిగిందంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పడాన్ని చూస్తుంటే ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడేది తానేనన్న పవన్‌కళ్యాణ్ ముక్తసరిగా క్షమాపణతో దాటవేసే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను అడ్డుకునేందుకు లారీలను అడ్డం పెట్టిన తీరును గమనిస్తే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడకుండా ఉండేందుకు చేసిన కుట్రగానే అర్థమవుతోందన్నారు. సమావేశంలో బెస్త వెంకటేష్, రాఘవ, రఫి, బాలాజీ, హిద్దూ, హేమకిరణ్, వంశీ, గణ తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి


ప్రసాద్ (ఫైల్)

బుక్కరాయసముద్రం: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం పసులూరు గ్రామానికి చెందిన ఓబులేసు, అంజినమ్మ దంపతుల కుమారుడు ప్రసాద్ (11) 5వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో ఇంటి వద్దనే ఉన్న బాలుడు... స్నేహితులతో కలసి కమ్మగుడ్డం క్వారీ వద్ద నీటి గుంత వద్ద ఈతకు వెళ్లాడు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో కుంటలో నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికి తీయించారు. ఘటనపై బీకేఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటి విడుదల తగదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం అర్బన్: విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం జలాశయం నుంచి ఇష్టారాజ్యంగా నీటిని దిగువకు వదిలేయడం సరికాదని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ హితవు పలికారు. శుక్రవారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం జలాశయానికి 1,622 టీఎంసీల వరద వచ్చి చేరినా... హంద్రీ–నీవా కింద సాగైన పంటలు పూర్తయ్యే వరకూ నీరు ఇచ్చే పరిస్థితి లేదంటూ తెలంగాణ ప్రభుత్వం విధించిన నిబంధనపై ఏపీ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలన్నారు. శ్రీశైలం డ్యామ్ నుంచి ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి పేరుతో తెలంగాణ ప్రభుత్వం 358.84 టీఎంసీలు, ఏపీ ప్రభుత్వం 199.38 టీఎంసీల నీటిని పోటీ పడి దిగువకు వదిలేశాయన్నారు. హంద్రీ–నీవా కాలువ వెడల్పు, ప్రస్తుత పంటల రక్షణ అంశంపై హంద్రీ–నీవా సాగుదారులతో కలసి సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 19న కర్నూలులో సదస్సు ఉంటుందన్నారు. డిమాండ్ల సాధనకు 27న రాయలసీమ జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గోకులం షెడ్ల ప్రారంభం

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం పశువుల షెడ్లను శుక్రవారం జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఇల్లూరులో గోకులం షెడ్డు ప్రారంభించి, మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద 9 గ్రామ పంచాయతీల్లో చిన్న, సన్నకారు రైతులకు 20 పశువుల షెడ్లు నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు సూచించారు. అనంతరం కల్లూరులో సత్యసాయి వాటర్ సంప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోకులాలు పూర్తి చేయండి

- పశుశాఖ జేడీ వెంకటస్వామి


మాట్లాడుతున్న పశుశాఖ జేడీ వెంకటస్వామి

అనంతపురం అగ్రికల్చర్: నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) కింద మంజూరు చేసిన గోకులాల షెడ్ల నిర్మాణాలు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పశుశాఖ డీడీ కార్యాలయంలో అనంతపురం డివిజన్ డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, పశువ్యాధి నిర్ధారణకేంద్రం ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్రతో కలసి గోకులాల నిర్మాణాల అంశంపై ఏడీలు, డాక్టర్లతో ఆయన సమీక్షించారు. పాడి రైతులకు ఉపయోగపడేలా ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన గోకులాల షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణాలు మొదలుపెట్టని ప్రాంతాల్లో వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులోకి వచ్చాయని, ఈ నేపథ్యంలో పశువైద్య సేవలు మరింత మెరుగ్గా కొనసాగించాలన్నారు. బ్రూసెల్లోసిస్, డీవార్మింగ్, గాలికుంటు, పీపీఆర్ వ్యాధులకు సంబంధించి చేపట్టిన ఉచిత వ్యాక్సినేషన్ల కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. 31వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని సాధ్యమైనంత తొందరంగా పూర్తి చేసి కచ్చితమైన గణాంకాలు సమర్పించాలని ఆదేశించారు. అంతకు ముందు పశుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

తప్పులు చేస్తే హెచ్ఎంలదే బాధ్యత

- విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: పోస్టులను నిలబెట్టుకోవడం కోసం బడుల్లో లేని పిల్లలను అటెండెన్స్‌లో చూపించొద్దని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలతో వెబెక్స్ నిర్వహించారు. అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్కూల్ సమావేశ మందిరం నుంచి డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, ఎంఈఓలు, నూతన ప్రతిపాదిత స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలోనూ మోడల్ ప్రాథమిక స్కూల్ ఏర్పాటుకు విధివిధానాలు పంపామన్నారు. ఆ మేరకు జిల్లాలో కసరత్తు చేసి పూర్తిస్థాయి జాబితా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

కిడ్నాపర్ల అరెస్ట్

తాడిపత్రి రూరల్: వివాహితను కిడ్నాప్ చేసి, నిలువుదోపిడీ చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం గుడిపాడుకు చెందిన వీరాంజనేయులు కుటుంబసభ్యులు, తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన వివాహిత రేణుక కుటుంబసభ్యులు కలసి గతంలో సజ్జలదిన్నె సమీపంలో ఉన్న బండల పాలీస్ యూనిట్‌లో కార్మికులుగా పని చేశారు. ఈ పరిచయంతో అప్పట్లో తన వ్యక్తిగత అవసరాల కోసం రూ.30 వేలను రేణుకాతో అప్పుగా తీసుకున్న వీరాంజనేయులు ప్రామిసరీ నోట్ రాయించి ఇచ్చాడు. వడ్డీతో సహా అప్పు తీర్చినా ప్రామిసరీ నోట్ రేణుక ఇవ్వలేదు. అప్పట్లో గొడవ పడిన వీరాంజనేయులపై రేణుక దాడి చేయించింది. దీంతో కక్ష పెంచుకున్న వీరాంజనేయులు... తన భార్య రాధమ్మ, అత్త భూలక్ష్మితో కలసి పథకం వేశాడు. గురువారం వ్యవసాయ కూలి పనులకు తోటి కూలీలతో కలసి ఆటోలో యుగుడూరుకు వెళుతున్న రేణుకను మార్గమధ్యంలో అడ్డుకుని స్కార్పియో వాహనంలో కిడ్నాప్ చేశారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న బంగారు మాంగల్యం చైన్, కమ్మలు, మాటీలను లాక్కొని వదిలేసి, ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం ఉదయం వీరాంజనేయులుతో పాటు ఆయన కుటుంబసభ్యులను, ప్యాపిలికి చెందిన స్కార్పియో డ్రైవర్ దశరథ్‌ను అరెస్ట్ చేసి, బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

18న నవోదయ ప్రవేశ పరీక్ష


లేపాక్షి/పుట్టపర్తి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఉదయం 10.30 గంటల్లోపు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలి. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 7,987 మంది విద్యార్థులకు 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అడ్మిట్ కార్డులను www.navo daya.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడు చేసుకో వచ్చు. వివరాలకు 95732 87480లో సంప్రదించవచ్చు.

పెట్రోల్ రాయితీ కోసం దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం రూరల్: సొంత వ్యాపారం, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తూ మూడు చక్రాల వాహనాలు కలిగిన దివ్యాంగులకు రాయితీతో పెట్రోల్ సరఫరా చేయనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారు సదరం సర్టిఫికెట్, పెట్రోల్ బిల్లులు, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్, ఫొటోలు, వాహనం ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పని చేస్తున్న సంస్థ ధ్రువీకరణ పత్రాన్ని జతపరిచిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోపు అందజేయాలి. వివరాలకు 08554–232380లో సంప్రదించాలని సూచించారు.

బట్టబయలైన టీడీపీ నేతల ఇసుక దందా

- రోజూ 30 టిప్పర్లు, 40 ట్రాక్టర్లలో ఇసుక అక్రమ తరలింపు
- స్పెషల్ పార్టీ పోలీసుల నిఘాతో గుట్టురట్టు
- 2 టిప్పర్లు, హిటాచీ పట్టివేత


పోలీసుల అదుపులో ఉన్న హిటాచీ, టిప్పర్లు

శింగనమల: మండలంలో టీడీపీ నాయకుల ఇసుక దందా గుట్టు రట్టయింది. మండల వ్యాప్తంగా ఉన్న వంకలు, వాగుల నుంచి రోజూ 30 టిప్పర్లు, 40 ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తనిఖీలు చేపట్టిన స్పెషల్‌పార్టీ పోలీసులు గుర్తించారు. పెద్ద మొత్తంలో ఇసుక దోపిడీ సాగుతున్నా రెవెన్యూ, మైనింగ్, స్థానిక పోలీసులు పట్టించుకోక పోవడం గమనార్హం. వంకలు, వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో తమ బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోతోందంటూ చాలా కాలంగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా ఫలితం లేకపోయింది. దీంతో విసుగు చెందిన రైతులు, ప్రజలు విషయాన్ని నేరుగా జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రంగంలో దిగిన స్పెషల్ పార్టీ పోలీసులు గురువారం రాత్రి పెరవలి, జలాలపురం, చీలేపల్లి వంకల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ హిటాచీతో పాటు రెండు టిప్పర్లు పట్టుబడ్డాయి. వాహనాలను శింగనమల పోలీసులకు స్వాధీనం చేశారు. కాగా, వాస్తవాలు బహిర్గతం కావడంతో స్పెషల్ పార్టీ పోలీసులే విస్తుపోయారు. శింగనమల మండలం పెరవలి, జలాలపురం, చీలేపల్లి, తరిమెల, కల్లుమడి, సోదనపల్లి వంకల నుంచి అక్రమంగా ఇసుకను టీడీపీ నాయకులు తరలిస్తున్నారు. వంకలలో హిటాచీలు పెట్టి ఒక టిప్పరు ఇసుకను రూ.7వేలు చొప్పున విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. రోజూ శింగనమల మండలంలోని వంకలు, వాగుల నుంచి 30 టిప్పర్లు, 40 ట్రాక్టర్ల ఇసుకను రేయింబవళ్లు ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు నిర్ధారణ అయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 8 నెలల్లోనే ఇసుక దందాతో దాదాపు రూ.2 కోట్లకు పైగా సొమ్మును టీడీపీ నాయకులు ఆర్జించినట్లు ఆ పార్టీలోని కొందరు కార్యకర్తలు బాహాటంగానే పేర్కొంటుండడం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ దందాను అరికట్టాలని రైతులు కోరారు.

సైబర్ నేరగాళ్ల కుట్ర... పసిగట్టిన విశ్రాంత ఉద్యోగికి సన్మానం


నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సీఐ శ్రీకాంత్, సైబర్ సెల్ సీఐ జాకీర్

అనంతపురం: 'నీవు క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావు. నిన్ను తప్పించాలంటే రూ.30 లక్షలు ఇవ్వాలి' అంటూ సైబర్ నేరగాడు చేసిన ఫోన్ కాల్‌పై వెంటనే స్పందించకుండా అప్రమత్తం చేసిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి నారాయణరెడ్డిని పోలీసులు ఘనంగా సత్కరించారు. వివరాలు... అనంతపురానికి చెందిన నారాయణరెడ్డి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ పదవీవిరమణ పొందారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా ఆయనకు సైబర్ నేరగాడు ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తూ వచ్చాడు. బెదిరింపులకు తొలుత తలొగ్గకపోయినా... ఆ తర్వాత అనుమానం వచ్చిన ఆయన వెంటనే సైబర్ విభాగాన్ని సంప్రదించాడు. స్పందించిన సైబర్ పోలీసులు ఆయనను టూటౌన్ సీఐ శ్రీకాంత్ వద్దకు పిలుచుకెళ్లారు. అదే సమయంలో సైబర్ నేరగాడు మరోసారి ఫోన్ చేయడంతో ఆ కాల్‌ను సీఐ స్వీకరించి, మాట్లాడారు. సారాంశం మొత్తం విన్న తర్వాత 'నీవు సైబర్ నేరగాడివని తెలుసు. ప్రజలను ఇలా ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరంగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం' అంటూ సీఐ తనదైన శైలిలో మాట్లాడడంతో వెనువెంటనే అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. సైబర్ నేరగాడి పన్నాగాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న నారాయణరెడ్డిని అభినందిస్తూ పోలీసులు ఘనంగా సన్మానించారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అనంతపురం రూరల్: నగర ప్రజలకు వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని ఎఫ్‌కే తాజ్‌మహల్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు పకృద్దీన్ అన్నారు. శుక్రవారం రుద్రంపేట బైపాస్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఢిల్లీ ఎర్రకోట, తాజ్‌మహల్ సెట్టింగులతో ఆకట్టుకునేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. అంకిత్, నిఖిల్, రెహమాన్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం కలెక్టరేట్ యూనిట్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి గురువారం కలెక్టరేట్ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో కేఆర్‌ఆర్‌సీ, పీజీఆర్‌ఎస్, డీఎస్‌ఓ, సర్వే శాఖ, యూనియన్ బ్యాంకు మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమానికి డీఆర్‌ఓ ఎ.మలోల ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కేఆర్‌సీసీ తహసీల్దారు వాణిశ్రీ, టైపిస్ట్ ఆర్.రేఖ బృందం ప్రథమ బహుమతి, సర్వే శాఖ బృందం ద్వితీయ బహుమతి, యూనియన్ బ్యాంక్ బృందం తృతీయ బహుమతి సాధించారు. మిగిలిన వారి పార్టిసిపేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి భరత్‌కుమార్, కోశాధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్ రావు, సంయుక్త కార్యదర్శి అక్రం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు



తప్పిపోయిన బాలుడితో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

అనంతపురం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయాల వద్ద నిర్వహిస్తున్న పోలీసు బందోబస్తు, భద్రతను జిల్లా ఎస్పీ పి.జగదీష్ పర్యవేక్షించారు. నగరంలోని అతి పురాతనమైన చెన్నకేశవ దేవాలయం వద్ద బందోబస్తు, భక్తుల క్యూలైన్లను పరిశీలించారు. దర్శనం కోసం వచ్చి తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన మూడేళ్ల బాలుడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాలుడిని ఆ తల్లిదండ్రులకు అప్పగించారు.

చదువుల తల్లికి 'అమ్మ' చేయూత



ఆర్థిక చేయూతనందిస్తున్న అమ్మ రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ విద్యార్థిని చదువుకునేందుకు ఫీజు చెల్లించి అండగా నిలిచారు అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి. వివరాలు.. రాంనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటేశు, రమణమ్మ దంపతుల కుమార్తె గౌతమి డిగ్రీ చదువుతోంది. తండ్రి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న సమయంలో డయాబెటిస్ అధికమై ఒక కాలు తొలగించాల్సి వచ్చింది. జీవనోపాధి కోసం తల్లి నాలుగిళ్లలో పాచిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అనారోగ్యంతో మంచానికి పరిమితమైన భర్త వెంకటేశు వైద్య ఖర్చులు, కుమార్తె గౌతమి కాలేజీ ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి వెంటనే స్పందించారు. వెంకటేశు కృత్రిమ కాలికి అవసరమైన రూ.40 వేలు, గౌతమి తక్షణ ఫీజు రూ.20 వేలు, మరో సెమిస్టర్ ఫీజు కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో వెంకటేశు కుటుంబానికి అండగా ఉంటామని రమణారెడ్డి భరోసా ఇచ్చారు.

- మారిపోయిన రూపురేఖలు
- రెస్టారెంట్ల హబ్‌గా మారిన హైదరాబాద్–బెంగళూరు హైవే
- అందుబాటులో బ్రాండెడ్ షోరూంలు, జ్యూవెలరీ షాపులు

చారిత్రక నగరం... అందరికీ అనుకూలం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరం రూపురేఖలు మారిపోయాయి. ప్రధాన నగరాలకు ధీటుగా విస్తరిస్తోంది. పదేళ్ల క్రితం వరకు సాధారణ అర్బన్ ప్రాంతం మాత్రమే. పేరుకు నగరం అయినప్పటికీ మిగిలిన పట్టణాల తరహాలోనే అరకొర సౌకర్యాలతో ఉండేది. నగరాల్లోని జీవనశైలి, వసతులు, సంస్థలు వంటివి పెద్దగా కన్పించేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మెట్రోపాలిటన్ నగర స్వరూపాన్ని తలపించేలా అనంతపురం జిల్లా కేంద్రం రూపుదిద్దుకుంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ కు పెట్టింది పేరుగా నిలిచిన అనంతకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అందుకు భిన్నంగా నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడుతున్నారు.

అందరికీ ఆమోద యోగ్యం

వాతావరణ, భౌగోళిక అనుకూలతలు అనంతపురం నగర విస్తరణకు దోహదపడుతున్నాయి. ఏ ప్రాంతం వారైనా సులువుగా ఇమిడిపోయేలా ఇక్కడి వాతావరణం ఉంటుంది. మరీ వేడిగానూ ఉండదు. అలాగనీ మరీ చల్లగానూ ఉండదు. ఇక భౌగోళిక పరంగా చూస్తే ఇటు బెంగళూరు, అటు కర్నూలు, హైదరాబాద్ నగరాలతో చక్కటి కనెక్టివిటీ ఉంది. రవాణాకు అత్యంత ప్రధానమైన జాతీయ రహదారి–44 కూడా నగరం మీదుగానే వెళ్తోంది.

విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్..

రియల్ ఎస్టేట్ రంగం ఓ వైపు విస్తరించడం, గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, ప్రజలు అనంతపురం నగరంలో స్థిరపడుతున్నారంటే ఇక్కడ లభిస్తున్న ఉపాధి అవకాశాలని చెప్పాలి. అదేవిధంగా గతంలో పోల్చితే అనంతపురం నగరంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. వైఎస్సార్ హయాంలో చేపట్టిన చర్యల వల్ల మరో 40 ఏళ్ల పాటు తాగునీటి సమస్య ఉండదు. పీఏబీఆర్ డ్యాం తాగునీటి పైప్‌లైన్ పథకం ద్వారా నగరవాసులకు తాగునీటికి ఢోకా లేదు.

నలుదిశలా అభివృద్ధి..

అనంతపురం నగరం నలువైపులా విస్తరిస్తోంది. నగర పాలక సంస్థ వాస్తవ పరిధి 16.35 చదరపు కిలోమీటర్లు అయినప్పటికీ పలు రూరల్ ప్రాంతాలు కూడా నగరంలో అంతర్భాగంగా అభివృద్ధి చెందుతున్నాయి. తూర్పున బుక్కరాయ సముద్రం, ఎస్కేయూ, పడమర కక్కలపల్లి, కురుగుంట, ఉత్తరాన పాములాయి, దక్షిణాన రాప్తాడు వరకు నగరం విస్తరిస్తోంది. గతంలో నగరంలో చాలా తక్కువ సంఖ్యలో అపార్ట్‌మెంట్లు ఉండేవి. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా అపార్ట్‌మెంట్లు, విల్లాలు దర్శనమిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టవర్‌క్లాక్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్, గుత్తి రోడ్డు, రుద్రంపేట రోడ్డు, జేఎన్‌టీయూ, రాజీవ్ కాలనీ రోడ్డు ఇలా నగరం నలువైపులా అభివృద్ధి జరిగింది. గతంలో ఉపాధి కోసం ప్రజలు కేరళ, హైదరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాలకు వెళ్లే వారు. ఇప్పుడు అనంతపురానికే కేరళ, బీహార్, యూపీ, తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఉపాధి పొందుతున్నారు. అదేవిధంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మార్ట్‌లు, సూపర్ మార్కెట్లు, అధిక సంఖ్యలో ఏర్పాటయ్యాయి. బ్రాండెడ్ షోరూంలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన జ్యువెలరీ షాపులు అనంతలో భారీగా ఏర్పాటయ్యాయి. మోటార్ రంగానికి సంబంధించి ద్విచక్ర, ఫోర్ వీలర్, తదితర షోరూంలు పెద్ద ఎత్తున అనంతపురంలో వెలిశాయి.



అనంతపురం నగరానికి తలమానికంగా నిలుస్తున్న టవర్‌క్లాక్

అనంతపురం 1799లో దత్త మండలానికి (రాయలసీమతో కూడిన బళ్లారి) కేంద్రంగా ఉండేది. అనంతపురానికి సర్ థామస్ మన్రో మొదటి కలెక్టరు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటీషు భారత సైన్యానికి అనంతపురం వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన కేంద్రం. ఇప్పటి జేఎన్‌టీయూ ప్రాంగణాన్ని అప్పట్లో ఆయుధ బంకరుగా వాడేవారు. అతిథ్య రంగం కూడా శరవేగంగా వృద్ధి చెందుతోంది. త్రీస్టార్ మొదలుకుని అన్ని వర్గాల ప్రజలకు అనువైన హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ఇక పర్యాటకంగానూ నగరానికి గుర్తింపు లభిస్తోంది. ఇక్కడి రథం ఆకారంలో గల ఇస్కాన్ దేవాలయం ప్రముఖ పర్యాటక ఆకర్షణ.





సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



ఎస్కే యూనివర్సిటీ

విద్యార్థుల భవితకు పెట్టింది పేరు

ఒకప్పుడు అనంతపురంలో విద్యనభ్యసించడానికి స్థానికులు కూడా ఆసక్తి చూపేవారు కాదు. ప్రభుత్వ వైద్య కళాశాల, ఎస్కేయూ, జేఎన్‌టీయూ, తదితర ప్రాంతాల్లో నాణ్యత ప్రమాణాలు పెరగడంతో ఇక్కడ విద్యనభ్యసించేందుకు విద్యార్థులు తెగ ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు ఇంజినీరింగ్, నర్సింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయి.

మెట్రో జీవనశైలి..

మెట్రో తరహాలో అనంతపురం నగర ప్రజల జీవన శైలి ఉంటోంది. ప్రధానంగా ఆహార సంస్కృతి (ఫుడ్ కల్చర్) విపరీతంగా వృద్ధి చెందుతోంది. రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్నాయి. హైదరాబాద్–బెంగళూరు హైవే రెస్టారెంట్ల హబ్‌గా మారిపోయింది. అరేబియన్, హైదరాబాదీ వంటకాలు మొదలుకుని కేఎఫ్‌సీ చికెన్ వరకు ప్రతి ఆహారం లభిస్తోంది.

● మీకు తెలుసా

ఎండు పండ్లు ఎంత ఆరోగ్యం?

ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి తగినన్ని ప్రొటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ అవసరం. వీటన్నింటిని పొందడానికి డ్రై ఫ్రూట్స్ ఒక మంచి ఆప్షన్. అందుకే డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లతోపాటు చాలామంది తెలిసిన వాళ్లు కూడా చెబుతారు. అయితే అవి ఆరోగ్యానికి మంచిది కదా అని.. ఇష్టమొచ్చినట్టు తింటే



ఆరోగ్యానికి మేలు బదులు ముప్పు వాటిల్లుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

అతి సర్వత్రా వర్జయేత్ అన్నారు పెద్దలు. అంటే ఎందులోనూ అతి పనికి రాదన్నమాట. ఈ సూత్రం డ్రై ఫ్రూట్స్‌కి కూడా వర్తిస్తుంది.

డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే.. షుగర్స్, క్యాలరీ లు కూడా ఉంటాయి. కాబట్టి వీటిని 20 గ్రాముల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే నేరుగా తినడం కూడా మంచిది కాదు.



స్విచాఫ్ ది ఫోన్!

ఓపెన్ ది మైండ్!

ప్రస్తుత కాలంలో ఫోన్‌తోనే ప్రతి ఒక్కరికీ పని. స్మార్ట్ ఫోనే ఫ్రెండ్. ఫోనే పార్ట్‌నర్. సెల్లే సర్వస్వం. అయితే ఓ రోజు ఫోన్ లేకుండా గడిపితే ఎలా ఉంటుంది. వారంలో ఓ రోజు పనికి సెలవు తీసుకున్నట్లే ఫోన్‌కి స్విచ్ ఆఫ్ చేసి పక్కన పడేస్తే..? వారాంతంలో ఓ రోజు పనికి దూరంగా ఉన్నట్లే ఫోన్‌కు దూరంగా ఉంటే ఎలా ఉంటుంది.. అనే ఆలోచన ఊహించడానికే ఏదోలా ఉంది కదా... అదేం కాదు.. ఫోన్ లేకపోతే ఏం జరుగుతుందో చూద్దాం.

చేతిలో ఫోన్ లేకపోతే మెదడు ఓపెన్ అవుతుంది. సొంతంగా ఆలోచించడం ఆరంభం అవుతుంది. ఒకదానితో మరొక విషయాన్ని బేరీజు వేసుకోవడం మొదలుపెట్టే ఖాళీని మెదడుకు ఇచ్చి చూద్దాం.

సెలవు రోజు ఇంటికి అవసరమైన వస్తువులు తెచ్చుకోవడం లేదా ఆర్డర్ చేసుకోవడం వంటి పనులు పూర్తి చేసుకున్న తర్వాత ఇక ఆ రోజుకు ఫోన్ ముట్టుకోవద్దు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంట్లో పెట్టి కాలనీలో రోడ్లన్నీ చుట్టి వస్తే... మనం నివసించే ప్రదేశం ఎలా ఉందో తెలుస్తుంది. కొత్తగా కడుతున్న ఓ భవనం కనిపిస్తుంది. ఇంతకు ముందు ఈ ప్రదేశంలో ఏముండేది? ఓ ప్రశ్న మదిలో మెదలుతుంది. కానీ సమాధానమే తట్టదు. గడచిన పదేళ్లుగా ఇదే కాలనీలో ఉన్నప్పటికీ వారంలో పది-పదిహేను సార్లు ఇదే దారిలో ప్రయాణించినప్పటికీ మనం ఈ ప్రదేశానికి చిరపరిచితులం కాలేకపోయామా అనే సందేహం కూడా అనిపిస్తుంది. నిజానికి ఈ ప్రదేశానికి మనం చిరపరిచితులయ్యాం, కానీ మనకే ఈ ప్రదేశం చిరపరిచితంగా మారలేకపోయింది. ఒక్కరోజైనా చేతిలో ఉన్న ఫోన్‌ని జేబులో పెట్టుకుని ఈ దారిలో



నడిచి ఉంటే కదా! ఏ విషయమైనా మెదడు గ్రహింపుకు వచ్చేది. అనుక్షణం కళ్లు, చెవులు, మెదడు ఫోన్‌తో ఎంగేజ్ అయి ఉంటాయి. అలవాటు పడిన దారిలో దేహం యాంత్రికంగా సాగిపోతూ ఉంటుంది. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి కూర్చున్న తర్వాత కూడా టీవీ స్క్రీన్ మీద దృష్టి కేంద్రీకరిస్తాం. ప్రపంచంలోని విషయాలన్నింటినీ మెదడులోకి గుప్పించడంలోనే రోజు పూర్తవుతుంటే... ఇక మెదడు సొంతంగా ఆలోచించేదెప్పుడు? ఆ మాత్రం వెసులుబాటు దొరికినప్పుడే మెదడు తన సృజనాత్మకతను బయటపెడుతుంది.

ఒక గంటతో మొదలు పెట్టండి!

వారంలో ఓ రోజు ఫోన్, టీవీ, కంప్యూటర్, ట్యాబ్, ల్యాప్‌టాప్ అన్నింటికీ సెలవు ప్రకటించి తీరాలి. మెదడుకు రెక్కలు విచ్చుకుని విహరించే అవకాశం కల్పించాలి. ఒకేసారి రోజంతా అన్ని స్క్రీన్‌లకూ ఆఫ్ అంటే కొంత కష్టం కావచ్చు. టీవీ, కంప్యూటర్ లైతే మన చేతిలోనే ఉంటాయి. ఫోన్ కాల్స్ మన చేతిలో ఉండవు. ఇంట్లో ఒక ఫోన్ స్విచాఫ్‌లో ఉంటే 'ఫోన్ ఆఫ్‌లో ఉందేమిటి' అంటూ మరొకరి ఫోన్‌కు కాల్స్ వస్తుంటాయి. కాబట్టి మొదట్లో ఒక గంటతో మొదలు పెట్టండి. రెగ్యులర్‌గా ఫోన్ చేసే స్నేహితులు, బంధువులకు 'ఇది స్విచాఫ్ అవర్' అని మెసేజ్ పెట్టేసి ఫోన్ బంద్ చేయాలి. గంటతో మొదలు పెట్టి క్రమంగా 'స్విచాఫ్ డే'గా మార్చాలి. 'స్విచాఫ్ డే' కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే రోజవుతుంది. కుటుంబ బంధాలు ఆనందాల హరివిల్లుగా మారుతాయి.

యోగా

నేలపైన మ్యాట్ వేసుకొని, శరీరాన్నంతా స్ట్రెచ్ చేస్తూ చేయాలని అందరూ యోగా చేయడానికి సిద్ధ పడరు. అందుకు వయసు, అనారోగ్యం, చిన్న చిన్న గాయాలు వంటివి కారణం అవుతుంటాయి. ఇలాంటప్పుడు కుర్చీ లేదా సోఫాలో కూర్చొని కూడా యోగ సాధన చేయవచ్చు.

ఈగిల్ ఆర్మ్స్ భంగిమ అంటే ఇది గరుడాసనను పోలిన విధంగా ఉంటుంది. ఇందులో కూర్చొనే విధానంలోనే తేడా ఉంటుంది. శరీర కదలికలకు, శ్వాస పని తీరులో మెరుగుకు ఇలా సాధన చేయవచ్చు.

భుజబలానికి కీలకం



ఇలా ప్రయత్నించవచ్చు..

● కుర్చీలో నిటారుగా కూర్చొని, పాదాలను నేలమీద ఆనించాలి. దీర్ఘశ్వాస తీసుకుని, వదులుతూ చేతులను విశాలంగా గరుడ పక్షి రెక్కల్లా చాచాలి. భుజాలను నిటారుగా ఉంచాలి.



● ఐదు శ్వాసలు తీసుకొని, వదిలిన తర్వాత రెండు చేతులను పైకి ఎత్తాలి. చేతులను సాధ్యమైనంత పైకి సాగదీస్తున్నట్టు ఉంచాలి. ఆ తర్వాత రెండు చేతులను హృదయస్థానానికి తీసుకురావాలి. కుడి చేతిని ఎడమ చెయ్యి కింద నుంచి తీసుకుంటూ వ్యతిరేక దశలో రెండు చేతులను పట్టుకోవాలి. ఈ సమయంలో భుజాలు కూడా కొద్దిగా ముందుగా వంగుతాయి. ఈ భంగిమను రోజూ సాధన చేస్తుంటే ముంజేతుల దగ్గర నుంచి ఒకదాన్నొకటి చుట్టినట్టుగా వస్తుంది. ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలాలి. తిరిగి మెల్లగా యథాస్థితికి రావాలి.

● ఇదే విధంగా ఎడమ నుంచి కుడి చేతివైపుకు కూడా చేయాలి. ఒక్కో భంగిమలో ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదులుతూ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది.

● కుర్చీ/సోఫాలో కూర్చున్నప్పుడు కాళ్లను కూడా నేల మీద నుంచి వీలైనంత పైకి లేపి, పది సెకన్లు ఉంచి, తిరిగి యథాస్థానంలోకి తీసుకురావచ్చు. ఈ విధంగా చేయడం వల్ల పాదాల వరకు రక్త ప్రసరణ మెరుగవుతుంది.

పాలు... రాగులు ఏవి బెటర్

శరీరానికి కాల్షియం అనేక రోజువారీ పనులు చేసేందుకు ఉపకరిస్తుంది. అందువల్ల మన డైట్‌లో కాల్షియంని చేర్చుకోవడం ముఖ్యం. జున్ను, బొప్పాయి, మల్బరీ, లిచీ, కివి, బచ్చలికూర, బ్రకోలీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల చాలా సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. ఆరోగ్యంగా కూడా ఉంటారు.

పాలు, రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఎందులో ఉంటుందంటే...

పాలు, రాగులు రెండూ ఒకదానికి మించి లాభాలని అందిస్తాయి. ఉదాహరణకి..100 మి.లీ పాలు తాగితే 110 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. అదే 100 గ్రాముల రాగులని తీసుకుంటే, దాదాపు 350 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థని ఆరోగ్యంగా ఉంచితే, ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల రక్తహీనత ఉన్నవారికి రాగులు మంచిది. రాగుల్లో ఉండే పొటాషియం వంటి ఇతర పోషకాలు మొత్తం శరీర ఆరోగ్యానికి సాయపడతాయి. పాలలో పోషకాలతోపాటు ఉండే ఎలక్ట్రోలైట్స్ బాడీని హైడ్రేట్ చేస్తాయి. రాగులు షుగర్ ఉన్నవారికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండి గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ని నియంత్రిస్తుంది కాబట్టి, మీ అవసరాలని బట్టి ఏది మంచిదో నిర్ణయించుకోవడం ఉత్తమం.



తొక్కలతో మొక్కలకు పోషణ

చాలా మంది వేరుశెనగ పప్పుల్ని తిని.. వాటి తొక్కల్ని పారేస్తుంటారు. అయితే, మనం వేస్ట్ అనుకున్న ఈ తొక్కలతో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. వేరుశెనగ తొక్కల్లో నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి మొక్కల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సాయపడతాయి. అంతే కాకుండా వీటిలో ఫైబర్, ప్రొటీన్ కూడా ఉన్నాయి. ఇవి మొక్కలకు తగిన పోషణ ఇస్తాయి. వేరుశెనగ తొక్కల్ని ఉపయోగించి కంపోస్ట్ ఎరువు తయారు చేయవచ్చు. ఇందుకోసం వేరుశెనగ తొక్కల్ని బాగా ఎండబెట్టాలి. ఆ తర్వాత వీటిని బాగా మెత్తగా పొడిలా చేసుకోండి. ఈ పొడిని ఇప్పుడు డైరెక్ట్‌గా కుండీలోని మట్టిలో కలపవచ్చు. వేరుశెనగ తొక్కల పొడిని వాడే ముందు మట్టి బాగా కలియబెట్టాలని మరచిపోకూడదు. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది బాగా పచ్చగా, ఏపుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.



మరకలు ఇలా మాయం..

ఉన్ని దుస్తుల మీద మరకలు ఏర్పడితే.. వాటిని డైరెక్ట్‌గా వాషింగ్ మెషిన్‌లో ఉపయోగించకూడదు. వాషింగ్ మెషిన్‌లో వేయడానికి ముందు.. సాఫ్ట్ స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించాలి. తేలిక పాటి లిక్విడ్ డిటర్జెంట్, నిమ్మరసం వంటి వాటిని అప్లై చేసి.. స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించడం బెస్ట్ ఆప్షన్. ఆ తర్వాత మరకలు తొలగిన తర్వాత వాష్ మెషిన్‌లో వేసి బట్టలు ఉతకవచ్చు.



మీకు తెలుసా?

చాలా మంది కూల్ డ్రింక్స్ తాగుతుంటారు. అందులోనూ సోడా ఉండే వాటిని ఎక్కువ మంది ఇష్టంగా తీసుకుంటారు. వేసవికాలం, చలికాలం అనే సంబంధం లేకుండా వీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాల కన్నా... ఆరోగ్య సమస్యలే ఎక్కువ. కూల్ డ్రింకులు, సోడాలు, చక్కెర పానీయాలు తాగడం వల్ల మధుమేహం,ఊబకాయం, కొవ్వు పెరిగి కాలేయం, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని పెంచుతుంది. కొందరు సోడాకు బదులు డైట్ సోడా తాగితే ఆరోగ్యంపై అంతగా ప్రభావం ఉండదని అనుకుంటూ ఉంటారు. కానీ, మెటబాలిక్ సిండ్రోమ్, అలాగే స్ట్రోక్ ప్రమాదాలను పెంచుతుందని పలు అధ్యయనాల్లో తేలింది. మరి కొన్ని పరిశోధనల ప్రకారం, డైట్ సోడా వినియోగం కూడా ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది.





డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం

- రాజమౌళి



''ఆర్‌ఆర్‌ఆర్' సినిమాని డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలో డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి థ్రిల్ అయ్యాను'' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ హైదరాబాద్‌లో సినిమా-హోమ్ కోసం భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ స్టూడియోను నెలకొల్పింది. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ ఛైర్మన్, హీరో నాగార్జున అక్కినేని సమక్షంలో ఈ స్టూడియోను రాజమౌళి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ- ''డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం. స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. నా తర్వాతి సినిమా విడుదలయ్యే సమయానికి భారతదేశం అంతటా మల్టీ డాల్బీ సినిమా ఉంటుంది. ప్రేక్షకులు దాన్ని అనుభూతి చెందడం థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అన్నారు. ''అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరాన్ని జరుపుకుంటున్న సందర్భంగా వర్చ్యువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండడం, దేశంలో తొలి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ ఫర్ సినిమా-హోమ్‌ను ఏర్పాటు చేయడం గర్వంగా ఉంది. భారతీయ సినిమాలను మ్యాప్‌లో ఉంచడమే మా ప్రయత్నం'' అన్నారు నాగార్జున. అన్నపూర్ణ స్టూడియోస్ ఈడీ సుప్రియ యార్లగడ్డ తదితరులు పాల్గొన్నారు.

ఊహలకు మించి ఉంటుంది

- బాలకృష్ణ



● ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్, బాలకృష్ణ, ప్రగ్యా జైస్వాల్

''సంక్రాంతి పండగకి విడుదలైన నా సినిమాలన్నీ ఘన విజయం సాధించాయి. ఈ సంక్రాంతి కానుకగా రిలీజవుతున్న 'డాకు మహారాజ్' కూడా ఘన విజయం సాధిస్తుంది. ఈ చిత్రం గురించి ప్రేక్షకులు ఏం ఊహించుకుంటున్నారో అంతకు మించి ఈ సినిమా ఉంటుంది'' అని బాలకృష్ణ చెప్పారు. బాబీ కొల్లి దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా, బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా కీలక పాత్రలు చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ రేపు (ఆదివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ- ''తిరుపతి తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి'.. ఇలా వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. బాబీ కొల్లి మాట్లాడుతూ-''నా టీమ్‌తో కలిసి ఎంతో శ్రద్ధగా 'డాకు మహారాజ్' కథని సిద్ధం చేశాను. బాలకృష్ణగారితో ఒకసారి పని చేస్తే మళ్లీ పని చేయాలనిపిస్తుంటుంది'' అని చెప్పారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ- ''ఐదేళ్ల క్రితం వైకుంఠ ఏకాదశి రోజున 'అల వైకుంఠపురములో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేసి, జనవరి 12న ఆదివారం సినిమా విడుదల చేశాం. ఇప్పుడు 'డాకు మహారాజ్'కి కూడా అదే జరిగింది. 'అల వైకుంఠపురములో'లాగే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ-''కొన్ని సినిమాలకు ప్రాణం పెట్టి సంగీతం చేయాలనిపిస్తుంది. అలాంటి సినిమా 'డాకు మహారాజ్'' అన్నారు. ఈ వేడుకలో వైజాగ్ ఎంపీ భరత్, బాలకృష్ణ కుమార్తె తేజస్విని, కెమెరామేన్ విజయ్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ తదితరులు పాల్గొని, 'డాకు మహారాజ్' చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.



''సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'బ్లాక్ బస్టర్ పొంగల్...' అనే పాట వెంకటేశ్‌గారికి చాలా నచ్చింది. దీంతో ఆయనే స్వయంగా ఆ పాట పాడతానని చెప్పడంతో నేను షాక్ అయ్యాను. కానీ ఆయన 20 నిమిషాల్లో ఆ పాట పాడటంతో సంగీత దర్శకుడు భీమ్స్ కూడా షాక్ అయ్యాడు'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి చెప్పారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి విలేకరులతో పంచుకున్న విశేషాలు...

సంక్రాంతికే రావాలనుకున్నాం

- అనిల్ రావిపూడి

● వెంకటేశ్‌గారితో నేను తీసిన 'ఎఫ్ 2' (2019) సంక్రాంతికి వచ్చి, విజయం సాధించింది. 'ఎఫ్ 3' కూడా సంక్రాంతికి రావాల్సింది కానీ మిస్ అయ్యింది. మా కాంబోలో మూడో సారి చేసే సినిమాని ఎలాగైనా పండగకి తీసుకొస్తే బావుంటుందని సినిమా ఆరంభం అప్పుడే సంక్రాంతికి రావాలనుకున్నాం. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం. 'సంక్రాంతికి వస్తున్నాం' కథ ఒక రెస్క్యూ ఆపరేషన్‌కి సంబధించినది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజుల ప్రయాణం సంక్రాంతికి ముందు ల్యాండ్ అవుతుంది. ఒక భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త పాత్ర వెంకటేశ్‌గారిది. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా ఇది. ట్రైలర్ అందరికీ బాగా నచ్చింది. థియేటర్స్‌కి వచ్చాక సినిమా అద్భుతంగా నచ్చితే మూవీ బ్లాక్ బస్టరే. ● కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారిపోయింది. మంచి కథ రాసి, గొప్పగా తీస్తే సరిపోదు. థియేటర్స్‌కి జనాలు రాకపోతే సినిమాకి రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తెచ్చుకోగలమని నా అభిప్రాయం. ఈసారి ప్రమోషన్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాం. వెంకటేశ్ గారి లాంటి పెద్ద స్టార్ హీరో సరదాగా అల్లరి చేయడం, రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది. నేను హీరోలకి ఫ్యాన్‌గానే ఉంటాను. రిలేషన్‌ని పాజిటివ్‌గా ఉంచుతాను కాబట్టి వాళ్ల నుంచి కూడా అంతే ప్రేమ వస్తుంది. ● 'దిల్' రాజుగారితో 'పటాస్' సినిమాతో నా ప్రయాణం ఆరంభమైంది. రాజు గారు, శిరీష్ గారు అంటే నా కుటుంబం లెక్క. మాది పదేళ్ల ప్రయాణం. ఇక ఉమెన్ సెంట్రిక్‌గా ఒక స్పోర్ట్స్ స్టోరీ చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కొన్నాళ్ల తర్వాత ఆ నేపథ్యంలో మూవీ చేస్తాను. 'ఎఫ్ 4' సినిమా కచ్చితంగా ఉంటుంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి కూడా ఫ్రాంచైజీలు చేసుకునే అవకాశం ఉంది.

థ్రిల్లర్ రెడీ



● రవి వర్మ, శ్రీవిద్య, పూజా రామచంద్రన్

ధన్యా బాలకృష్ణ, రవి వర్మ, పూజా రామచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'హత్య'. శ్రీవిద్య బసవ దర్శకత్వంలో ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రవి వర్మ మాట్లాడుతూ- ''శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. ఈ చిత్రంలో నేను చాలెంజింగ్ రోల్ చేశాను. ఈ మూవీ ఆడియన్స్‌కు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''చాలా కాలం తర్వాత 'హత్య' వంటి ఓ డిఫరెంట్ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను'' అన్నారు పూజా రామచంద్రన్. ''నా తొలి చిత్రం 'మథ' తరహాలోనే నా రెండో చిత్రం 'హత్య' కూడా థ్రిల్లర్ మూవీ. ప్రేక్షకులు ఈ మూవీని ఆదరించాలి'' అని కోరారు శ్రీవిద్య. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ నరేశ్ కుమారన్ .పి మాట్లాడారు.

ఒక పథకం ప్రకారం....

సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రుతీ సోధి, ఆషిమా నర్వాల్ హీరోయిన్లుగా నటించారు. సముద్ర ఖని కీలక పాత్ర చేశారు. వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేశ్ నిర్మించారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం విడుదల కానుంది. శుక్రవారం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ- ''ఇదొక విభిన్నమైన కథ. అడ్వొకేట్ పాత్రలో సాయిరామ్ శంకర్, పోలీసు పాత్రలో సముద్ర ఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో సాగే క్రైమ్, మిస్టరీ కథనాలతో మా సినిమా ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది'' అని పేర్కొన్నారు.



● సాయిరామ్ శంకర్



ఇది చూడొచ్చు

నాటి రామాయణం నేటి పాత్రలతో.....

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం సింగమ్ ఎగైన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన ఇతిహాసాలలో గొప్ప విలువలతో కూడుకున్న కథ రామాయణం. నాటి రామాయణాన్ని నేటి నేటివిటీతో ప్రస్తుత ప్రముఖ నటీనటులతో మళ్లీ మన ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి. ఇదే ప్రయత్నాన్ని గతంలో చాలా మందే చేసినా యాక్షన్ నేపథ్యంలో వచ్చిన 'సింగమ్' సిరీస్ చిత్రానికి ఈ తరహా ప్రయోగం చేయడం మొదటిసారి. అందులోనూ బాలీవుడ్‌లో భారీ తారాగణంతో ఇలాంటి అంశంతో కూడిన కథ తీయడమనేది నిజంగా సాహసమనే చెప్పాలి. ముందుగా 'సింగమ్' సిరీస్ గురించి చెప్పుకుందాం. ఈ సిరీస్‌లో వచ్చిన మూడో చిత్రం 'సింగమ్ ఎగైన్'. సిరీస్‌లో ఈ భాగం ప్రేక్షకుల ముందు రావడానికి దాదాపు పదేళ్లు పట్టింది. 2011లో 'సింగమ్' మొదటి చిత్రం రాగా 2014లో రెండో భాగంగా 'సింగమ్ రిటర్న్స్' విడుదలైంది. ఆ తరువాత మూడో భాగం 2024లో 'సింగమ్ ఎగైన్'గా వచ్చింది. అన్ని సిరీస్‌లలో కథానాయకుడిగా ప్రముఖ స్టార్ అజయ్ దేవగన్ నటించారు. ఇకపోతే ప్రస్తుత 'సింగమ్ అగైన్' చిత్రంలో అజయ్ దేవగన్‌తో పాటు కరీనా కపూర్, దీపికా పదుకోన్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్ తదితర ప్రముఖ నటులు నటించారు. రామాయణ కథనే ఇతివృత్తంగా అల్లుకున్న కథ ఇది. రామాయణంలోని పాత్రలను రిలేట్ చేస్తూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ స్క్రీన్‌ప్లే కొనసాగుతుంది. ప్రత్యేకంగా చెప్పాలంటే సినిమాలో రామాయణ కథను టీవీ షో రూపంలో చూపిస్తూ కథను నడిపిస్తారు. అప్పటి రామాయణ కథ చరిత్రతో మనకు పరిచయం. అందుకే అది రమణీయ కావ్యం. కానీ ఇప్పటి 'సింగమ్ ఎగైన్' రణరంగమే ప్రధాన సూత్రంగా నడిచిన కథ. ఆఖరుగా ఒక్క మాట... రామాయణ కథను నేటి తరానికి మళ్లీ చెప్పడమనేది మంచిదే కానీ, ఎన్నో భావావేశాలున్న రామాయణ మూల కథలోంచి ఒక్క శౌర్య, వీర రసం మాత్రం తీసుకుని సినిమా రూపొందించడం ఏమాత్రం సమంజసమో సినిమా తీసిన దర్శక-నిర్మాతలు, చూస్తున్న మన లాంటి ప్రేక్షకులు ఆలోచించాల్సిందే. ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా ఈ సినిమా స్ట్రీమ్ అవుతోంది. మీరు కూడా చూసి ఆలోచించడం మొదలు పెట్టండి.

- ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.